ఈ-పేపర్ తెలుగు డైలీ 8PM

# ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL

https://epaper.eyyaltynews.in/

బుధవారం, జూన్ 3, 2026

# తెలంగాణకు భారీ వర్ష సూచన.. 18 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్




**ఇయ్యాల్టి న్యూస్,వెబ్ డెస్క్, జూన్ 3:** తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఈ రోజు, రేపు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. ఈ భారీ వర్షాలతోపాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరోవైపు దేశవ్యాప్తంగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు రేపటిలోగా కేరళ, తమిళనాడు తీరాలను తాకనున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న రాత్రి నుంచే పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రాత్రంతా ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. రాబోయే రెండు రోజులు మరిన్ని భారీ వర్షాలు పడనున్నందున, ముఖ్యంగా రైతులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.



తెలంగాణకు కేంద్రం గుడ్ న్యూస్...కొత్తగా రెండు హైవేలకు గ్రీన్ సిగ్నల్... 2



'అదే నా రాస్తా' -పవన్ కల్యాణ్ ఎక్స్? పోస్టు వైరల్ 2



నెహ్రూ రికార్డు బద్దలు.. సుదీర్ఘకాలం పాలించిన ప్రధానిగా మోదీ సరికొత్త చరిత్ర! 2



పెండ్లాంపై కోపంతో... తుపాకీతో రోడ్డెక్కి హల్ చల్.. సీన్ కట్ చేస్తే..? 3




అంబర్‌పేట బాపునగర్ కాకతీయ మార్కెట్‌లో అక్రమ నిర్మాణం




నల్లకుంట శంకర్ మఠ్ ఎదురు గల్లీలో




కాచిగూడ నింబోలి అడ్డలో




ప్రేమ్ నగర్ హైమావతి స్కూల్ గల్లీలో

- కంకర కనిపిస్తే చాలు... గద్దల్లా వాలిపోతున్నరు.. !
- 'సారు పిలుస్తున్నాడు' అంటూ దబాయింపు..
- ఫ్లోరుకో రేటు ఫిక్స్... బ్యారం కుదరకపోతే తెల్లారే నోటీసులు..
- మీ కింత.. మాకింత అంటూ అధికారులతో దోస్తానా..
- సందట్లో సడేమియాల్లా లోకల్ లీడర్లు..
- మధ్యలో రావడంతో బర్దాష్ చేసుకోలేక కన్నెర్ర..
- మీడియా లోగో ముందుల పేదల రక్తం తాగుతారా అంటూ సుద్దపూస మాటలు.. !
- మాజీలైనా ప్రెజెంట్ కార్పొరేటర్లుగా బిల్డప్పు..
- టికెట్ వస్తదో రాదోనని గ్రేటర్ ఎన్నికల ముందే మరింత గుంజుడు ప్రోగ్రామ్!
- అంబర్‌పేటలో అక్రమ కట్టడాల దందా..
- ఇప్పటికైనా పెద్దసార్లు నిద్ర లేస్తరో.. లేదో మరి...

# ఇల్లు కట్టుకునేటోడి రక్తాన్నిజుర్రుకుంటున్నరు..!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్‌పేట, జూన్ 3:**
అంబర్‌పేట నియోజకవర్గంలో ఇప్పుడు కొత్త రోగం పట్టుకుంది. ఎక్కడైనా ఇల్లు కట్టుకుందామని నాలుగు కంకర రాళ్లు, రెండు సిమెంట్ బస్తాలు రోడ్డు మీద వేస్తే చాలు.. ఖద్దర్ చొక్కాల అనుచరులు ల్యాండ్ అయిపోతున్నారు. జీహెచ్‌సీ పర్మిషన్లు, రూల్స్, రెగ్యులేషన్‌లతో మాకేం పని భయ్యా.. 'మా సారుకు పైసలు ఇస్తే.. పర్మిషన్ తోని పనేముంది' అంటూ బాహాటంగానే దందా సాగిస్తున్నరు. అంబర్‌పేట నియోజకవర్గంలోని దాదాపు అన్ని డివిజన్లలో ఇప్పుడు నడుస్తున్న అక్రమ తంతుపై..'ఇయ్యాల్టి'స్పెషల్ స్టోరీ...

### 'సారు పిలుస్తున్నాడు'.. రాకపోతే అంతే సంగతులు!

ఇల్లు కట్టేటోడికి ఇటుకల తిప్పలైతే.. ఈ లోకల్ లీడర్లకు కలెక్షన్ల తిప్పలొచ్చినయ్. పునాది తీయకముందే వాలిపోయి, "సారు నిన్ను అర్జంటుగా రమ్మంటున్నాడు.. కలిసి మాట్లాడుకో" అంటూ బిల్డర్లను, సామాన్యులను బెదిరిస్తున్నారు. ఫ్లోరుకు ఇంత అని ముందే రేట్లు ఫిక్స్ చేసి పెడుతున్నారు. ఒకవేళ బ్యారం కుదరకపోతే.. తెల్లారేసరికి జీహెచ్‌సీ అధికారుల నుంచి నోటీసులు వస్తున్నాయి. అంటే, అధికారులతో వీళ్లకున్న 'కమ్మక్కు' ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు. మీకింత.. మాకింత అని పంచుకుంటూ, ఇల్లు కట్టుకునేటోడి రక్తాన్ని జుర్రుకుంటున్నారు.

### సందట్లో సడేమియాలు.. మీడియా ముందు సుద్దపూస మాటలు!

ఈ పంచాయితీలో మధ్య ఎవరైనా మాకేమైన ఇప్పించాలని వస్తే అస్సలు బర్దాష్ చేసుకోవడం లేదు. కన్నెర్ర జేస్తూ గొడవలకు దిగుతున్నారు. ఇక నియోజకవర్గం ప్రధాన డివిజన్ మాజీ కార్పొరేటర్ అయితే ఓ అడుగు ముందుకు వేసి మీడియా లోగోలు, కెమెరాలు కనిపిస్తే చాలు.. "పేదల రక్తం తాగుతారా? అక్రమ కట్టడాలు ఆపాల్సిందే" అంటూ పెద్ద పెద్ద సుద్దపూస మాటలు చెప్తున్నరు. తీరా కెమెరా దించంగానే 'సెటిల్మెంట్' ఎంత అయిందో కనుక్కోమంటూ అనుచరులను పురమాయిస్తున్నరు. మాజీలైనా సరే.. ఇంకా ప్రెజెంట్ కార్పొరేటర్ల కంటే ఎక్కువ బిల్డప్ ఇస్తూ ఏరియాలను ఏలేస్తున్నరు.

### గ్రేటర్ ఎన్నికల భయం..ముందు చూపుతో వసూళ్ల జోరు!

"ముందు గ్రేటర్ ఎన్నికలు వస్తున్నాయి కదా.. మళ్లీ టికెట్ వస్తాదో రాదో.. గెలుస్తమో లేదో అని తాజా మాజీ కార్పొరేటర్లకు భయం పట్టుకుంది. అందుకే ఈసారి 'ముందు చూపు'తో పతార ఉన్నప్పుడే నాలుగు రాళ్లు వెనకేసుకోవాలని వసూళ్లపై మరింత ఫోకస్ పెట్టారని పబ్లిక్ టాక్... కాగా అంబర్‌పేట నియోజకవర్గంలో ప్రతి గల్లీలో ఇదే తంతు నడుస్తోంది.. పెద్ద సార్లు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు కూర్చున్నారు. ఇప్పటికైనా పై అధికారులు నిద్ర లేచి ఈ అక్రమ దందాలకు, వసూళ్ల పర్వానికి బ్రేక్ వేస్తారో లేదో చూడాలి మరి !



## చంచల్ గూడ జైలుకు ఎమ్మెల్యే కాలేరు సారు..

# ములాఖత్‌ల దోస్తుకు పరామర్శ.!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 3:**
సింగరేణి సంస్థ మీద ఏందో గింత వివాదం వ్యాఖ్యలు చేసిందని మన బీఆర్ఎస్ లీడర్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్నను పోలీసులు పట్టుకున్న సంగతి తెల్సిందే కదా! హిమాయత్‌నగర్ కోర్టుల హాజరుపరిస్తే.. జడ్జి సాబ్ ఏకంగా 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించిండు. ఇంకేముంది.. పోలీసులు సుమన్నను తీసుకుని చంచల్‌గూడ జైల్లో పెట్టిన్రు. దోస్తు కష్టాల్లో ఉంటే చూస్తూ ఊరుకుంటామా ఏంది? అందుకే ఈ రోజు మన అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్న గబగబా చంచల్‌గూడ జైలుకు పయనమైండు. జైల్లో ములాఖత్ టైం లా లోపలికి పోయి.. బాల్క సుమన్నను కల్సిండు. "ఏం పరేషాన్ కాకు సుమన్న.. మేమంత ఉన్నం. ఇవన్నీ రాజకీయంలో మామూలే.. ధైర్యంగా ఉండు!" అంటూ వీపు తట్టి పరామర్శించిండు కాలేరన్న. ఇద్దరు నేతలు కాసేపు జైలు ముచ్చట్లు, బయట నడుస్తున్న రాజకీయ ముచ్చట్లు మాట్లాడుకున్నరు. సుమన్న అరెస్ట్‌ను ఖండిస్తూ, ఆయనకు అండగా ఉంటామని కాలేరు వెంకటేశ్ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. మొత్తంమీద జైల్లో ఉన్న సుమన్నకు, కాలేరన్న ములాఖత్ గింత ధైర్యాన్ని ఇచ్చిందనే చెప్పాలి!



ఖాద్రీబాగ్‌లో సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

# అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలి : ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్‌పేట, జూన్ 3:** గోల్నాక డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేసి రెండు వారాల్లో అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ జలమండలి అధికారులను ఆదేశించారు. గోల్నాక డివిజన్ ఖాద్రిబాగ్ లో రైన్ వాటర్ పైప్ లైన్, డ్రైనేజ్ పైప్‌లైన్ పనులను ఇయ్యాల ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ... సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని, నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# గ్రేటర్ జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వండి..

### సీఎంకు జీహెచ్ జే సొసైటీ సర్వసభ్య సమావేశంలో విజ్ఞప్తి

**ఇయ్యాల్టి న్యూస్, కాచిగూడ, జూన్ 3:** సుప్రీం కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా వర్కింగ్ జర్నలిస్ట్స్ యాక్ట్ ప్రకారం అన్ని కేటగిరీల్లోని జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జర్నలిస్టులం దరికి వెంటనే ఇళ్ళస్థలాలు కేటాయించాలని సమావేశం డిమాండ్ చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా.. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడం విచారకరమని పలువురు సీనియర్ జర్నలిస్టులు అన్నారు. బుధవారం హైదరాబాద్ చిక్కడపల్లి లోని శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికలో సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళ స్థలాలు, సుప్రీంకోర్టు తీర్పు, ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీకి స్థలం లేదా సభ్యులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని సమావేశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతూ తీర్మానించింది. అక్రెడిటేషన్ కార్డుతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం ఇవ్వాలని, జర్నలిస్టుల్లో వివక్ష చూపొద్దని సమావేశం కోరింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పని చేస్తున్న అన్ని కేటగిరీల జర్నలిస్టులకు 200 చ. గ స్థలాన్ని ఫ్యూచర్ సిటీలో కేటాయించాలని కోరుతూ సమావేశం తీర్మానించింది. సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, సొసైటీలో సభ్యత్వం తీసుకున్న 1350 మంది గ్రేటర్ జర్నలిస్టులు 18 ఏళ్ళుగా ఇంటి జాగల కోసం ఎదురు చూస్తున్నారని, గత ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని, కనీసం ఈ ప్రభుత్వం అయినా ఇళ్ళస్థలాలిచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నైశిదం సత్యనారాయణ మూర్తి, తెలంగాణ జనసమితి గ్రేటర్ బీసీ సెల్ అధ్యక్షుడు జశ్వంత్, సీనియర్ జర్నలిస్టులు తీగవరపు శాంతి, నాగవాణి, సొసైటీ కోశాధికారి తన్నీరు శ్రీనివాస్, డైరెక్టర్లు యర్రమిల్లి రామారావు. రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# గోపీనాథ్ ముండేకు భారతరత్న ప్రకటించాలి

- వంజరి సంఘాల డిమాండ్



**ఇయ్యాల్టి న్యూస్, అంబర్‌పేట, జూన్ 3:**
దేశంలోని బడుగు, బలహీన వర్గాల రాజకీయ సాధికారత కోసం విశేషంగా కృషి చేసిన ప్రముఖ నేత, స్వర్గీయ గోపీనాథ్ ముండే కు భారతరత్న పురస్కారం ప్రకటించాలని అఖిల భారత వంజరి సేవా సంఘం, తెలంగాణ వంజరి సేవా సంఘం కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి. అలాగే ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశాయి. గోపీనాథ్ ముండే 13వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లో వంజరి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, దేశంలోని బడుగు వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు, వారికి ప్రత్యామ్నాయ జాతీయ రాజకీయ వేదికను అందించేందుకు గోపీనాథ్ ముండే నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. జాతీయవాద రాజకీయాల్లో వెనుకబడిన వర్గాల ప్రాతినిధ్యాన్ని పెంచడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, అందువల్ల భారతరత్నకు అన్ని విధాలా అర్హులని అన్నారు. కేంద్రమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సమయంలోనే మరణించిన గోపీనాథ్ ముండే సేవలను గుర్తించి, ఆయన జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాలను కోరారు.

తెలంగాణ రాష్ట్రానికి గోపీనాథ్ ముండే వంటి ప్రజానాయకుల అవసరం ఎంతో ఉందని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత వంజరి సేవా సంఘం నాయకులు సాల్వేరు కృష్ణ, ఎదుగని శంకర్, ఎదుగని హరినాథ్, కాలేరు సురేష్, ధాత్రిక కాశీనాథ్, కాలేరు యుగంధర్, రిటైర్డ్ డీఎస్పీ శివప్రసాద్, రత్నం సంతోష్ ఆముద లక్ష్మణ్, మహదేవ్ ముండే, కాలేరు సాయిబాబా, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ టీచర్లకు గుడ్ న్యూస్.. ఇక నుంచి ప్రత్యేక టెట్.. గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విద్యాశాఖ..



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 3:**
తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక అత్యంత తీపి కబురు అందించింది. ప్రస్తుతం విధుల్లో ఉన్న ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల ప్రయోజనార్థం రెండు ప్రత్యేక ఉపాధ్యాయ అర్హత పరీక్షలను నిర్వహించేందుకు ప్రభుత్వం అధికారికంగా అనుమతి మంజూరు చేసింది. సాధారణంగా ప్రతి ఏటా షెడ్యూల్ ప్రకారం నిర్వహించే రెండు రెగ్యులర్ టెట్ పరీక్షలకు ఇది పూర్తిగా అదనం. అంటే, ఇకపై ప్రతి సంవత్సరం జరిగే రెండు సాధారణ టెట్ పరీక్షలతో పాటు, కేవలం ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల కోసమే ప్రత్యేకంగా మరో రెండు అదనపు టెట్ పరీక్షలను విద్యాశాఖ నిర్వహించనుంది. ఈ నిర్ణయానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ విభాగం అధికారికంగా ఒక మెమోను జారీ చేసింది.




విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అనుముల లావణ్య

# బీఆర్ఎస్ నేత బాల్క సుమన్‌ను వెంటనే విడుదల చేయాలి

- బీఆర్ఎస్ మహిళ నాయకురాలు అనుముల లావణ్య.

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 3:** బాల్క సుమన్‌పై అక్రమ కేసులు పెట్టి కాంగ్రెస్ సర్కార్ కక్ష సాధింపులకు పాల్పడుతుందని నల్లకుంట డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ మహిళా నాయకురాలు అనుముల లావణ్య మండిపడ్డారు. బుధవారం నల్లకుంటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయలేక బీ ఆర్ ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారని, కోర్ట్ లో న్యాయ పోరాటం చేసి ,న్యాయ బద్ధంగా బాల్క సుమన్ కు మద్దతు ఇస్తామని పేర్కొన్నారు. బాల్క సుమన్ పై ఆయుధాల కేసు నమోదుచేయడం విడ్డూరమని, తక్షణమే విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వం విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన దిగుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ సర్కార్ మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేశారు.

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL
https://epaper.eyyaltynews.in/

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్.. సెన్సెక్స్ 323 పాయింట్లు పతనం




**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 3:** భారత స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 323 పాయింట్లు నష్టపోయి 74,326 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 86 పాయింట్లు నష్టపోయి 23,396 వద్ద ముగిసింది. ఉదయం ట్రేడింగ్ నష్టాలతోనే ప్రారంభమైంది. సెన్సెక్స్ 74,300 పాయింట్లతో, 350కిపైగా పాయింట్ల నష్టంతో ప్రారంభమైంది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 100 పాయింట్ల నష్టంతో 23,400 వద్ద ప్రారంభమైంది. రోజంతా ట్రేడింగ్ నష్టాల బాటలోనే సాగింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్? ఇండియా పాలసీ మీటింగ్ ఈ రోజు ప్రారంభమైంది. వారాంతం వరకు కొనసాగనుంది. దీంతో వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం వంటి అంశాల్లో ఆర్బీఐ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది అనే అంశంపై ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు మార్కెట్‌పై నెగెటివ్ ప్రభావం చూపాయి. హోర్ముజ్ జలసంధి పూర్తిగా ఓపెన్ కాకపోవడం, చమురు ధరల పెరుగుదల వంటివి కూడా మార్కెట్‌పై ప్రభావం చూపాయి. దీంతో అమ్మకాల ఒత్తిడి పెరిగి మార్కెట్ నష్టాల్లో ముగిసింది.





## కచ్చితంగా తెలంగాణ భూమిపుత్రుల జాగీరే : కేటీఆర్

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 3:** జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. దేశంలో ఎవరికైనా పార్టీ పెట్టే హక్కు ఉందని, ఎక్కడైనా ఎన్నికల్లో పోటీ చేసే స్వేచ్ఛ ఉందని చెప్పిన ఆయన.. ఏ ప్రాంతంలో రాజకీయాలు చేయాలనుకుంటే ఆ ప్రాంత చరిత్ర, పోరాటాలు, ప్రజల భావోద్వేగాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ గతంలో (2023) కూడా తెలంగాణలో ఎన్నికల్లో పోటీ చేశారని, ఆయనను ఎవరూ అడ్డుకోలేదని గుర్తు చేశారు. గత పన్నెండేళ్లలోనో ఆయనకు ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయని ప్రశ్నించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున రాజకీయ సభ నిర్వహించాల్సిన అవసరం పవన్‌కు ఏముందని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రాంతీయవాదం గురించి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. 'మద్రాస్ రాష్ట్రం నుంచి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ఆమరణ దీక్ష కూడా ప్రాంతీయవాదమేనా?. తెలంగాణ ఉద్యమం కూడా ప్రజల ఆకాంక్షల కోసం జరిగిన పోరాటమే. దానిని తప్పుగా చిత్రీకరించడం సరికాదు. దేశభక్తి విషయంలో మాకు ఎవరి దగ్గరా పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక పరిశ్రమలు గుజరాత్‌కు వెళ్లిపోయాయి. అదే సమయంలో విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమానికి మేము మద్దతు ఇచ్చాము' అని కేటీఆర్ గుర్తు చేశారు.



## కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణం..

### హాజరైన రాహుల్, ఖర్గే

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 3:** కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. లోక్ భవన్‌లోని గ్లాస్ హౌస్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ఆయనతో ప్రమాణం చేయించారు. డీకే శివకుమార్ రాజ్యాంగం చేతపట్టుకుని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అజారుద్దీన్, మల్లు భట్టివిక్రమార్క తదితరులు హాజరయ్యారు. డీకే శివకుమార్ కేబినెట్‌లో మాజీ సీఎం సిద్ధరామయ్య తనయుడు యతీంద్రకు చోటు దక్కింది. పరమేశ్వర ఏకైక ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కర్ణాటక కొత్త మంత్రివర్గంలో 14 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారానికి ముందు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ తనకు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారని డీకే శివకుమార్ వెల్లడించారు. పార్టీలో అందరినీ కలుపుకుని ముందుకు సాగాలని ఆమె సూచించినట్లు తెలిపారు. తన నాయకత్వంపై సోనియా గాంధీ పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారని ఆయన పేర్కొన్నారు.

## తెలంగాణకు కేంద్రం గుడ్ న్యూస్...

# కొత్తగా రెండు హైవేలకు గ్రీన్ సిగ్నల్..




**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 3:** తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులు చేపట్టేందుకు ఇవాళ కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేశవ్యాప్తంగా పలు కొత్త ప్రాజెక్టులు ప్రకటించగా.. తెలంగాణలో కూడా నేషనల్ హైవే ప్రాజెక్టులకు ఆమోదముద్ర వేశారు. తెలంగాణలో ఎన్ హెచ్ -63, ఎన్ హెచ్ -563లోని వివిధ సెక్షన్లను నాలుగు లేన్లుగా విస్తరించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ఇందుకోసం రూ.7,597 కోట్లు కేటాయించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇక తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో జాతీయ రహదారులకు ఆమోదం తెలిపింది.

### రూ.39 వేల కోట్ల ప్యాకేజీ


దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కోసం రూ.39,290 కోట్ల పెట్టుబడికి కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం ఆరు ముఖ్యమైన ప్రతిపాదనలను ఈ సమావేశంలో ఆమోదించారు. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయడానికి పలు రాష్ట్రాల్లో జాతీయ రహదారి ప్రాజెక్టులను ఆమోదించింది. రామేశ్వరం-కోణార్క్-పారాదీప్ కోస్టల్ హైవే ప్రాజెక్ట్‌ను ఆమోదించగా.. ఇందుకు రూ.8,301 కోట్లు ఖర్చు చేయనుంది. దేశంలోని తూర్పు తీర ప్రాంతంలో అనుసంధానాన్ని ఈ ప్రాజెక్ట్ బలోపేతం చేస్తుందని కేంద్రం భావిస్తోంది. ఇక బీహార్‌లోని ఖగారియా-పూర్నియా సెక్షన్‌ను నాలుగు లేన్లుగా విస్తరించే ప్రాజెక్టుకు రూ.3,936 కోట్లు ఆమోదించారు. మధ్యప్రదేశ్‌లో ఎన్ హెచ్-347దీ అప్‌గ్రేడ్ కోసం రూ.4,415 కోట్ల పెట్టుబడిని కూడా ఆమోదించారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త వాహనాల కొనుగోలుపై 100 శాతం మోటారు వాహన పన్ను మినహాయింపు రిజిస్ట్రేషన్ ఫీజులో ఉపశమనాన్ని కూడా అందిస్తాయి. అయితే ఈ ప్రయోజనం తమ పాత వాహనాలను స్క్రాప్ చేసే లేదా వాటిని ఎన్ సీఏపీ యేతర నగరాలకు తరలించే వాహన యజమానులకు మాత్రమే అందుబాటులో ఉంటుంది.

# సీఎం రేవంత్‌తో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ భేటీ..

### తెలంగాణలో పెట్టుబడులపై చర్చలు




**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 3:** తెలంగాణ, దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా కీలక అడుగుపడింది. బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ షిపోకోసా పౌలస్ మషాటిలే బృందం సమావేశమైంది. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన ఈ భేటీలో ఇరుపక్షాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య అవకాశాలపై ప్రధానంగా చర్చించారు. సమాచార సాంకేతికత (ఐటీ), ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం వంటి కీలక రంగాల్లో పరస్పర సహకారంపై చర్చించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే దక్షిణాఫ్రికా కంపెనీలకు, పారిశ్రామికవేత్తలకు పూర్తి మద్దతు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీ) హైదరాబాద్ కేంద్రంగా మారిందని, ప్రపంచస్థాయి వైద్య సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో జరగనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు దక్షిణాఫ్రికా ప్రతినిధి బృందాన్ని సీఎం ఆహ్వానించారు. ఈ సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనరసింహ కూడా పాల్గొన్నారు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య చారిత్రక బంధం ఉందని డిప్యూటీ ప్రెసిడెంట్ మషాటిలే గుర్తుచేశారు. ఆఫ్రికన్ కాంటినెంటల్ ఫ్రీ ట్రేడ్ ఏరియా ద్వారా తెలంగాణ కంపెనీలకు విస్తృత మార్కెట్ అవకాశాలు లభిస్తాయని, ముఖ్యంగా ఫార్మా రంగంలో స్థానికంగా ఉత్పత్తి భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తామని ఆయన తెలిపారు



## జపాన్‌లో మసీదు వివాదం..


### పాకిస్తాన్ పరువు పోయింది..

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 3:** పాకిస్తాన్ అంతర్జాతీయంగా పరువు పోగొట్టుకోవడం అలవాటుగా మారింది. ఇస్లామిక్ ప్రపంచానికి పెద్దన్నగా కలరింగ్ ఇస్తున్న పాకిస్తాన్‌కు జపాన్ భారీ షాక్ ఇచ్చింది. జపాన్‌లోని కవాగోలో మసీదు వివాదంలో ఆ దేశ ప్రభుత్వం ఘాటుగా స్పందించింది. మసీదు భవనాన్ని అవసరమైన అనుమతులు లేకుండా నిర్మించినట్లు జపాన్ అధికారులు చెప్పారు. ఈ మసీదును సైతామా ప్రిఫెక్చర్‌లోని కవాగోలో లో నిర్మించారు. పర్వత అటవీ భూమిగా గుర్తించిన భూమిలో ఈ మసీదు ఉంది. ఇలాంటి ప్రదేశాల్లో అధికారులు ప్రత్యేక అనుమతి మంజూరు చేస్తే తప్ప సాధారణ నిర్మాణాలు చేయడం నిషేధం. ఈ భూమి మార్చి 2025లో ఫుజిమికి చెందిన ఒక రియల్ ఎస్టేట్ కంపెనీ నుండి కవాగోలో ఉన్న ఒక సంస్థ చేతుల్లోకి మారింది. ఈ ఏడాది ప్రారంభంలో మసీదు ప్రారంభోత్సవారికి పాకిస్తాన్ రాయబారి అబ్దుల్ హమీద్ హాజరయ్యారు. అయితే, ఇప్పుడు ఈ మసీదుకు తమకు ఎలాంటి సంబంధం లేదని పాకిస్తాన్ చెబుతోంది. జపాన్‌లో నివసిస్తున్న పాకిస్థానీయులు స్థానిక చట్టాలను పూర్తిగా పాటించాలని సూచించింది. ప్రార్థనా స్థలాలు సహా ఏ నిర్మాణ ప్రాజెక్ట్ అయినా స్థానిక ప్రభుత్వ అనుమతులు పొందిన తర్వాతే ప్రారంభించాలని స్పష్టం చేసింది.

### ఇరాన్ యుద్ధం.. అబుదాబి కీలక నిర్ణయం..

## ప్రవాస భారతీయులకు ఊరట!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 3:** ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అబుదాబి ప్రభుత్వం అక్కడి నివాసితులకు ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ఇళ్లు, దుకాణాలు, పారిశ్రామిక భవనాల అద్దెలను ప్రస్తుతానికి పెంచొద్దని ఆదేశాలు జారీ చేసింది. 'అబుదాబి రియల్ ఎస్టేట్ సెంటర్ (ఏడీఆర్ఈసీ) తీసుకున్న ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని అధికారికంగా ప్రకటించింది. కొత్త నిబంధనల ప్రకారం ప్రస్తుతం అద్దెకు ఉంటున్న వారి కాంట్రాక్టులను పునరుద్ధరించుకునే సమయంలో అద్దెను అస్సలు పెంచకూడదు. ఒకవేళ పాత వాళ్లు ఖాళీ చేసి వెళ్లినా ఆ స్థానంలోకి వచ్చే కొత్త వాళ్లకు కూడా పాత అద్దెనే వర్తింపజేయాలి. గతంలో ఏడాదికి గరిష్ఠంగా ఐదు శాతం వరకు పెంచుకునేందుకు యజమానులకు ఉన్న అవకాశాన్ని ప్రభుత్వం తాత్కాలికంగా రద్దు చేసింది.



'యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్'లో నివసించే ప్రవాస భారతీయులకు ఈ నిర్ణయం పెద్ద ఊరటను ఇచ్చింది. అక్కడ నివసించే విదేశీయుల్లో భారతీయుల సంఖ్యే ఎక్కువ. ప్రతినెలా వచ్చే జీతంలో అద్దెకే పెద్ద మొత్తంలో ఖర్చవుతుంది. ఇప్పుడు అద్దెలు పెరగవు కాబట్టి భారతీయులకు సొమ్ము మిగులుతుంది. చిన్న వ్యాపారులు కూడా తమ ఖర్చులను ముందే ప్లాన్ చేసుకునే అవకాశం దక్కింది. అబుదాబిలో రియల్ ఎస్టేట్ రంగానికి విపరీతమైన డిమాండ్ ఉంది. ఈ సమయంలో అద్దెలను నియంత్రించడం వల్ల మార్కెట్లో స్థిరత్వం వస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

అద్దెలు విపరీతంగా పెరిగిపోకుండా చూడటంతో పాటు ఇళ్లు మారే ఇబ్బందుల నుంచి ప్రవాస కుటుంబాలకు ఇది రక్షణ కల్పిస్తుంది. ప్రపంచ దేశాల నుంచి వచ్చే ప్రతిభావంతులకు అబుదాబి ఓ సురక్షితమైన వేదికగా మారడానికి ఈ నిర్ణయం దోహదపడుతుంది.




# 'అదే నా రాస్తా'

### -పవన్ కల్యాణ్ ఎక్స్ పోస్టు వైరల్

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 3:** ఏపీ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమాల్లో ఆసక్తికర పోస్టు పెట్టారు. మంగళవారం తన నివాసంలో ప్రెస్?మీట్ పెట్టిన సంగతి తెలిసిందే. తెలంగాణలో జనసేన పార్టీ ఉంటోందని పవన్ తేల్చిచెప్పారు. రాజకీయ క్షేత్రంలో నిలబడి తీరుతామని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ప్రముఖ కవి శేషేంద్ర రచించిన కవితను పవన్ కల్యాణ్ పోస్టు చేశారు. ఇప్పుడిది నెట్టింట చక్కర్లు కొడుతోంది. తెలంగాణ రాజకీయాల్లో జనసేన ప్రస్థానంపై ఆ పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టతనిచ్చిన మరుసటి రోజే సామాజిక మాధ్యమాల్లో పెట్టిన ఒక ఆసక్తికర పోస్టు నెట్టింట వైరల్ అవుతోంది. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో తెలంగాణలో జనసేన కచ్చితంగా ఉంటుందని, రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తుందని ఆయన తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో, రాజకీయ క్షేత్రంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని నిలబడతామనే సంకేతాన్ని ఇస్తూ ప్రముఖ మహాకవి గుంటూరు శేషేంద్ర శర్మ రచించిన ఒక శక్తివంతమైన కవితను పవన్ కల్యాణ్ తన 'ఎక్స్'లో పంచుకున్నారు.

## పవన్‌పై వ్యాఖ్యలు కరెక్ట్ కాదు..

### తెలంగాణ నేతలకు చంద్రబాబు హితవు




**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 3:** తెలంగాణ ఆవిర్భావం సందర్భంగా మంగళవారం హైదరాబాద్ గచ్చిబౌలిలో ఏర్పాటు చేసిన జనసేన సభకు పోలీసులు అనుమతించని విషయం తెలిసిందే. అయితే ఈ విషయంపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పందించారు. తెలంగాణలో జనసేన సభను అడ్డుకోవడం సరికాదన్నారు. గతంలో బీఆర్ఎస్ యూనిట్‌ను ఏపీలో పెట్టిందని చంద్రబాబు గుర్తు చేశారు. రాష్ట్రం విడిపోయిన 12 ఏళ్లు అయిందని, ఎవరెవరు ఏం చేశారో ప్రజలకు తెలుసన్నారు. లాజికల్‌గా ముందుకెళ్లాలి తప్ప ప్రశాంతి వాతావరణాన్ని చెడగొట్టొద్దని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## నెహ్రూ రికార్డు బద్దలు..

### సుదీర్ఘకాలం పాలించిన ప్రధానిగా మోదీ సరికొత్త చరిత్ర!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 3:** భారత రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో అరుదైన మైలురాయిని అందుకోనున్నారు. దేశంలో అత్యంత సుదీర్ఘకాలం పాటు నిరంతరాయంగా పాలించిన ప్రధానిగా జూన్ 10న ఆయన సరికొత్త రికార్డు సృష్టించనున్నారు. స్వతంత్ర భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న దశాబ్దాల నాటి రికార్డును మోదీ అధిగమించనున్నారు. 2014 మే 26న తొలిసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన మోదీ.. జూన్ 10 నాటికి వరుసగా 4,399 రోజుల పాలనను పూర్తి చేసుకోనున్నారు. దేశంలో మొదటి సాధారణ ఎన్నికల తర్వాత 1952 మే 13న నెహ్రూ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన 1964 మే 27న మరణించే వరకు వరుసగా 4,398 రోజుల పాటు ఆ పదవిలో కొనసాగారు. ఇప్పుడు ఆ రికార్డును మోదీ దాటనున్నారు. అంతకుముందు 2025 జులై 25న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పేరిట ఉన్న 4,077 రోజుల నిరంతరాయ పాలన రికార్డును మోదీ దాటేశారు. నెహ్రూ కాలంతో పోలిస్తే ప్రస్తుతం దేశ జనాభా, ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. తొలి సాధారణ ఎన్నికల సమయంలో దేశ జనాభా 34 కోట్లుగా ఉండగా ఓటర్లు 17 కోట్లు మాత్రమే.



మోదీ ప్రధాని అయ్యే నాటికి జనాభా 131 కోట్లకు చేరి ప్రస్తుతం 146 కోట్లు దాటింది. అలాగే 1952 ఎన్నికల్లో కేవలం 53 పార్టీలు పోటీ చేయగా.. 2024 లోక్‌సభ ఎన్నికల నాటికి పోటీ చేసిన పార్టీల సంఖ్య ఏకంగా 744కు చేరింది. నెహ్రూ తర్వాత వరుసగా మూడుసార్లు లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన ఏకైక ప్రధానిగా మోదీ నిలిచారు. కాంగ్రెసేతర ప్రధానిగా వరుసగా రెండుసార్లు పూర్తి మెజారిటీ సాధించిన రికార్డు కూడా ఆయనదే. గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా కలిపి అత్యధిక కాలం (8,930 రోజులకు పైగా) అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధిగా ఇప్పటికే మోదీ రికార్డు సృష్టించారు.

## ఎల్‌నినోపై కేంద్రం అప్రమత్తం.. భయాందోళన అక్కర్లేదని హామీ

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 3:** ఈ ఏడాది ప్రపంచానికి ఎల్‌నినో ముప్పు ముంచుకొస్తోంది.



గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రమాదకర ఎల్‌నినో రాబోతుందని ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరించింది.

జూన్-ఆగస్టు మధ్య ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడే అవకాశాలు 80 శాతం ఉన్నాయని డబ్ల్యూఎంఓ వెల్లడించింది. ఈ మేరకు ప్రపంచ దేశాలను హెచ్చరికస్తూ అప్రమత్తం చేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కూడా అలర్ట్ అయింది. డబ్ల్యూఎంఓ నివేదిక ప్రకారం.. పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర జలాల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల ఎల్‌నినో పరిస్థితులు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. దీని ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. అలాగే అనేక ప్రాంతాల్లో వర్షపాతం నమూనాలు మారిపోయి తీవ్ర వాతావరణ పరిస్థితులు ఏర్పడవచ్చని అంచనా వేస్తున్నారు.

## ఢిల్లీలో భారీ అగ్ని ప్రమాదం..

### 21 మంది సజీవ దహనం



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 3:** ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో 21 మంది సజీవ దహనమయ్యారు. అనేక మందికి తీవ్ర గాయాలయ్యాయి. 10 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు 40 మందిని కాపాడారు. మాలవీయ నగర్‌లోని లెమన్ గ్రీన్ రెస్టారెంట్‌లో ఉదయం 9 గంటల సమయంలో మంటలు చెలరేగుతున్నట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు షార్ట్ సర్క్యూటే కారణమై ఉండొచ్చని ప్రాథమికంగా నిర్ధారించారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చనిపోయిన వారి కుటుంబాలకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స కోసం రూ.50 వేలు అందజేస్తామన్నారు.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.in/
జనరల్ న్యూస్ | చూసి మురవాలే | బుధవారం, జూన్ 3, 2026


## మరో వివాదంలో సింగర్ మంగ్లీ..!



**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 3:** ఇటీవల వరుస వివాదాల్లో ఇరుక్కుంటున్న సింగర్ మంగ్లీ మెడకు మరో వివాదం చుట్టుకుంటోంది. ఫామ్ హౌసులో డ్రగ్స్ పార్టీ, అధిక వడ్డీ పేరుతో చేసిన ఘరానా మోసాల వంటి కేసుల విషయాల్లో వార్తల్లో నిలిచినా ఈ జానపద గాయని మంగ్లీపై సోషల్ మీడియాలో మరో ఇష్యూ లేవదీశారు నెటిజన్స్. అయితే కొద్దికాలం క్రితం ఓ కార్యక్రమంలో తెలంగాణ సాయుధ పోరాటంలో రాష్ట్రాన్ని ఒక ఊపు ఊపిన మా భూమి సినిమాలని "బండెనుక బండి గట్టి.. పదహారు బండ్లు గట్టి" అనే పాట పాడారు.

అయితే అప్పట్లో నిజాంకు, రజాకార్లకు వ్యతిరేకంగా గూడ అంజయ్య రాసిన ఈ పాట ప్రజల నాల్కలపై నానింది. ఈ పాట వెనకాల ఉన్న పెయిన్, ఎమోషన్ అర్థం చేసుకోకుండా పార్టీల్లో, పబ్బుల్లో పాడినట్టు, డ్యాన్స్ చేస్తూ మంగ్లీ ఈ పాట పాడటంపై మరోసారి విరుచుకు పడుతున్నారు నెటిజన్స్. ఆ గంతులు ఏంటీ? ఆ పాడటం ఏంటని మండిపడుతున్నారు. ఈ కార్యక్రమం గతంలో జరిగినదే అయినప్పటికీ.. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా మరోసారి తెర మీదికి వచ్చి రచ్చకు ఎక్కింది. తక్షణమే మంగ్లీ తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని నెటిజన్స్ డిమాండ్ చేస్తున్నారు.

## సెలబ్రిటీ అయితే రూల్స్ వర్తించవా? తమన్నా చేసిన పనికి నెటిజన్లు ఫైర్



**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 3:** టాలీవుడ్ స్టార్ హీరోయిన్ తమన్నా భాటియా ఓ వివాదంలో చిక్కుకున్నారు. ముంబైలో ఆమె చేసిన ఓ బోటు ప్రయాణం వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. అది చూసిన నెటిజన్లు ఆమె ప్రవర్తనపై తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. సరదాగా చేసిన ఈ రైడ్ తమన్నాను విమర్శలకు గురి చేస్తోంది. ఈ వైరల్ వీడియోలో తమన్నా చాలా సింపుల్‌గా ఒక టీషర్ట్, బ్లూ జీన్స్ ధరించి కనిపించారు. ఆమె లుక్ చాలా బాగుందంటూ కొందరు అభిమానులు కామెంట్లు పెడుతున్నప్పటికీ, మరికొందరు మాత్రం ఆమెపై ఫైర్ అవుతున్నారు. దానికి ప్రధాన కారణం.. బోట్‌లో ప్రయాణిస్తున్న సమయంలో తమన్నా ఎలాంటి లైఫ్ జాకెట్ ధరించకపోవడమే. నీటిపై ప్రయాణించే టప్పుడు కనీస భద్రతా నియమాలు పాటిం చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై నెటిజన్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

## డబ్బుల కోసం దిగజారిపోవాలా?... ఈషీ రెబ్బాపై నెటిజన్లు ఫైర్!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 3:** టాలీవుడ్ హీరోయిన్లు సినిమా అవకాశాలు రాకపోవడంతో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా డబ్బులు సంపాదించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో కొత్తగా వచ్చిన సబ్‌స్క్రిప్షన్ అనే ఆప్షన్‌ను వాడుకుంటూ ఆదాయం పొందుతున్నారు. ఈ పద్ధతిలో హీరోయిన్ల పర్సనల్ ఫోటోలు, వీడియోలు చూడాలంటే అభిమానులు ప్రతి నెల కొంత డబ్బులు కట్టాల్సి ఉంటుంది. ఇప్పటికే టాలీవుడ్ యంగ్ హీరోయిన్ అనన్య నాగళ్ల ఈ సబ్‌స్క్రిప్షన్ ద్వారా నెలకు ఒక్కో ఫాలోవర్ నుండి రూ. 299 వసూలు చేస్తోంది. అలాగే రామ్ చరణ్ 'చిరుత' సినిమా హీరోయిన్ నేహా శర్మ కూడా ఇదే బాటలో నడుస్తూ డబ్బు సంపాదిస్తోంది. తాజాగా, మన తెలుగు బ్యూటీ ఈషా రెబ్బా కూడా ఇదే ట్రెండ్‌ను ఫాలో అవుతుండటం ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది.





## నా భవిష్యత్తు పాడు కాకుండా... అది సహాయపడింది: రియా చక్రవర్తి

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 3:** బాలీవుడ్ యంగ్ హీరోయిన్ రియా చక్రవర్తి సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణం తర్వాత జీవితంలో ఎన్నో కష్టాలను, అవమానాలను ఎదుర్కొంది. ఆ సమయంలో సోషల్ మీడియాలో ఆమెపై తీవ్రస్థాయిలో ట్రోలింగ్, విమర్శలు వచ్చాయి. అంతటి బాధను అనుభవించినప్పటికీ, ఆమె జీవితంపై నమ్మకాన్ని కోల్పోలేదు. మళ్లీ ఇండస్ట్రీకి రీఎంట్రీ ఇచ్చి ప్రేక్షకులను అలరిస్తోంది. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో, గత కొన్ని సంవత్సరాలుగా ఆ బాధాకరమైన గతం నుండి బయటపడి తన జీవితాన్ని ఎలా చక్కదిద్దుకుందో రియా పంచుకుంది. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ కేసు తన వ్యక్తిత్వాన్ని పూర్తిగా ఎలా మార్చేసిందో వివరించింది. "ఆ సంఘటన తర్వాత నేను చాలా మారిపోయాను. ఇప్పుడు నాకు లోకజ్ఞానం బాగా తెలిసింది. నా స్నేహితులు నన్ను చూసి.. 33 ఏళ్ల బాడీలో ఉన్న 80 ఏళ్ల ముసలావిడ అని జోకులు వేస్తుంటారంటూ చెప్పకొచ్చింది.

## అతడితో నా స్క్రీన్ కెమిస్ట్రీ బెస్ట్.. ఇలియానా కామెంట్స్..

## తెలుగులో ఆ హీరో నా ఫేవరేట్..




**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 3:** ఒకప్పుడు టాలీవుడ్‌ను ఊపేసిన స్టార్ హీరోయిన్ గోవా బ్యూటీ ఇలియానా. తనదైన గ్లామర్, నటనతో కుర్రకారు గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న ఈ అమ్మడు.. తెలుగులో దాదాపు అందరు అగ్ర హీరోలతోనూ స్క్రీన్ షేర్ చేసుకుంది. మొదటి సినిమాతోనే విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ముఖ్యంగా మహేష్ బాబు సరసన ఆమె నటించిన పోకిరి చిత్రం ఇలియానా కెరీర్ మలుపు తిప్పింది. ఈ మూవీతో ఆమెకు అవకాశాలు క్యూ కట్టాయి. చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్న ఇలియానా.. ఇప్పుడు తన ఇద్దరూ కుమారులతో కలిసి ఫ్యామిలీ లైఫ్ ఎంజాయ్ చేస్తుంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇందులో ఇలియానా టాలీవుడ్ స్టార్ హీరోలపై చేసిన కామెంట్స్ నందమూరి అభిమానులను తెగ ఖుషీ చేస్తున్నాయి.

### 'పెద్ది'సినిమా ఫస్ట్ రివ్యూ..

## చరణ్ ఏ రేంజ్‌లో మెప్పించాడంటే..?

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 3: రామ్ చరణ్ పెద్ది సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. రేపు జూన్ 4న పాన్ ఇండియా వైడ్ ఈ సినిమా రిలీజ్ కాబోతుండగా నేడు రాత్రే ప్రీమియర్స్ పడనున్నాయి. అయితే ఇప్పటికే పలువురు బయ్యర్లు, సినీ పరిశ్రమ వ్యక్తులు, ఓవర్సీస్ లో కొంతమంది ఈ సినిమా చూసేసారు. దీంతో పెద్ది సినిమా టాక్ వినిపిస్తుంది. వృద్ధి సినిమాస్ బ్యానర్ పై కిలారు వెంకట సతీష్ నిర్మాణంలో బుచ్చిబాబు సాన దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. జగపతి బాబు, శివన్న, జాన్వీ కపూర్, దివ్యేందు శర్మ.. పలువురు




స్టార్స్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

సెన్సార్ రిపోర్ట్ ప్రకారం ఈ సినిమా ఫస్ట్ హాఫ్ చాలా బాగుందని, మాస్ ఎలిమెంట్స్ తో, కామెడీతో, జాన్వీ కపూర్ అందాలతో సాగుతుందని సమాచారం. ఇంటర్వెల్ బ్యాంగ్ తో సెకండ్ హాఫ్ పై ఆసక్తి నెలకొంటుంది. సెకండ్ హాఫ్ మాత్రం కాస్త నిదానంగా ఎమోషనల్ గా సాగుతుందట. మళ్ళీ క్లైమాక్స్ ఉత్కంఠభరితంగా రన్నింగ్ సీన్స్ ఉంటాయని తెలుస్తుంది.

కథ విషయానికొస్తే.. విజయనగరం దగ్గర ఓ కొండ దగ్గర్లో ఉండే పల్లెటూరు నుంచి పెద్ది, అతని మనుషులు వస్తారు. వీళ్లంతా ఆటల్లో బెస్ట్ అవ్వడంతో కొంతమంది వీళ్ళను ఆట కూలీలుగా పెట్టి గేమ్స్ నిర్వహిస్తూ డబ్బులు చేసుకుంటారు. వీళ్ళు పొట్టకూటి కోసం ఆ ఆటలు ప్రాణాలు తెగించి ఆడతారు. హీరో ఎంట్రీ క్రికెట్ గేమ్ తోనే ఉంటుందని, క్రికెట్ ఆడుతూనే ఫైట్ చేస్తాడని తెలుస్తుంది. తన మనుషుల్లో ఒకరు చనిపోవడం, తన ఊరికి గుర్తింపు రాకపోవడం, వీళ్ళపై కొంతమంది వివక్ష చూపించడంతో ఆట కూలిగా క్రికెట్, కుస్తీ ఆడే పెద్ది ఎదురుతిరుగుతాడని ఆ సీన్ తో ఇంటర్వెల్ ఉంటుందని టాక్. తమ ఊరి కోసం, తమ మనుషుల కోసం పెద్ది ఢిల్లీ వెళ్తాడని, సెకండ్ హాఫ్ అంతా ఢిల్లీలోనే జరుగుతుందట. ఢిల్లీలో పలు రాజకీయ నాయకులను కలవడానికి పెద్ది ట్రై చేస్తాడని, అయినా ఫలితం ఉండదు అని సమాచారం. దాంతో సెకండ్ హాఫ్ అయితే ఎక్కువ ఎమోషనల్ గా సాగదీశారట. క్లైమాక్స్ లో మళ్ళీ రన్నింగ్ సీన్స్ తో గూస్ బంప్స్ తెప్పిస్తారట.

ఇక జాన్వీ కపూర్ యాక్టింగ్ కొన్ని చోట్ల ఓవర్ యాక్షన్ అనిపిస్తుందట. అక్కర్లేకపోయినా ఆమెతో అందాలు ఆరబోయించారు. స్క్రీన్ ప్లే కూడా ఎలాంటి ట్విస్టులు లేకుండా సింపుల్ గా, రెగ్యులర్‌గా ఉందట. ఒకటి రెండు కామెడీ సీన్స్ జాన్వీతో ట్రై చేసినా వర్కౌట్ అవ్వలేదట. ఈ సినిమాకు చరణ్ పర్ఫార్మెన్స్, క్రికెట్, కుస్తీ, రన్నింగ్ సీన్స్ ప్రాణం పోశాయి. జగపతి బాబు అప్పల సూరి పాత్ర సినిమాకే హైలెట్. ఆయన తన పర్ఫార్మెన్స్ తో అదరగొట్టేశారట. బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ మాత్రం పర్వాలేదనిపించాడట.

ఎమోషనల్ సీన్స్ ప్రేక్షకులకు కనెక్ట్ అయితే సినిమా పెద్ద హిట్ అయినట్టే అంటున్నారు టాలీవుడ్ జనాలు. సినిమాటోగ్రఫీ విజువల్స్ మాత్రం ఓ రేంజ్ లో ఉన్నాయని చెప్తున్నారు. విజువల్స్ పరంగా పెద్ది హై లెవల్ స్టాండర్డ్స్ మెయింటైన్ చేసారంట. సినిమాపై ఖర్చు మాత్రం బాగానే పెట్టినట్టు ప్రతి సీన్ లో కనిపిస్తుందట. మొత్తానికి రామ్ చరణ్ పెద్ది సినిమా ఫ్యాన్స్ అయితే మెప్పిస్తుంది. జనరల్ ప్రేక్షకులకు ఎమోషనల్ అంశాలు కనెక్ట్ అయితే హిట్ అవుతుంది అని అంటున్నారు. మరి నేడు రాత్రి నుంచి సినిమా చూసాక ప్రేక్షకులు ఏమంటారో చూడాలి.

## అత్తమ్మ, భర్తతో అన్నా లెజినోవా..

### వైరల్ అవుతున్న డిప్యూటీ సీఎం ఫ్యామిలీ పిక్స్



**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 3:** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భార్య అన్నా లెజినోవా సోషల్ మీడియాలో షేర్ చేసిన కొన్ని ప్రత్యేకమైన ఫోటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. తన భర్త పవన్ కళ్యాణ్, అలాగే అత్తమ్మ అంజనా దేవితో కలిసి దిగిన ఈ అందమైన కుటుంబ చిత్రాలు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పవన్ కుటుంబ బంధాలకు ఈ ఫోటోలు అద్దం పడుతున్నాయని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

## పెండ్లాంపై కోపంతో...తుపాకీతో రోడ్డెక్కి

## హల్ చల్.. సీన్ కట్ చేస్తే..?

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 3:**

భార్యపై కోపంతో ఓ వ్యక్తి నాటు తుపాకీతో హల్ చల్ చేయడంతో గ్రామస్తులు భయాందోళనలకు గురైన ఘటన కృష్ణాజిల్లా మచిలీపట్నం సౌత్ మండలం పరిధిలోని కోన గ్రామంలో జరిగింది. ఈ ఘటనపై వెంటనే స్పందించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోన గ్రామానికి చెందిన రామాంజనేయులుకు, అతని భార్యకు మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మరోసారి వాగ్వాదం జరగడంతో ఆగ్రహానికి గురైన అతను, ఇంట్లో దాచిన నాటు తుపాకీని బయటకు తీసి భార్యను బెదిరించాడు. అంతటితో ఆగకుండా, లోడ్ చేసి ఉన్న ఆ తుపాకీతోనే గ్రామ ప్రధాన రహదారిపైకి రావడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. కొందరు భయంతో ఇళ్లలోకి పరుగులు తీశారు.




సమాచారం అందుకున్న మచిలీపట్నం పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. నిందితుడు రామాంజనేయులును అదుపులోకి తీసుకుని, అతని వద్ద ఉన్న లైసెన్స్ లేని తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అసలు అతనికి ఈ తుపాకీ ఎలా వచ్చిందనే కోణంలో విచారణ జరుపుతున్నట్లు వెల్లడించారు.

## హైదరాబాద్‌లో రామ్ చరణ్ గుడి..

### క్షీరాభిషేకాలతో పూజలు చేస్తున్న మెగా అభిమానులు

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 3:** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' కోసం మెగా అభిమానులు కళ్లు కాసేలా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా జూన్ 4న విడుదల కాబోతుండగా.. అప్పుడే రెండు తెలుగు రాష్ట్రాల్లోని సినిమా హాళ్ల వద్ద పండుగ వాతావరణం నెలకొంది. మరీ ముఖ్యంగా రామ్ చరణ్‌కు ఏకంగా గుడి కట్టేశారు అభిమానులు. హైదరాబాద్ కూకట్‌పల్లిలోని అర్జున్ థియేటర్ వద్ద మెగా ఫ్యాన్స్ చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారి అందరినీ షాక్‌కు గురి చేస్తున్నాయి. సాధారణంగా



స్టార్ హీరోల చిత్రాల రిలీజ్ సమయంలో థియేటర్స్ వద్ద పెద్ద పెద్ద కటౌట్స్ దర్శనమిస్తుంటాయి. కానీ కూకట్‌పల్లిలో మాత్రం ఫ్యాన్స్ ఓ అడుగు ముందుకు వేసి 'పెద్ది' సినిమాలోని రామ్ చరణ్ క్యారెక్టర్‌ను పోలిన భారీ విగ్రహాన్ని ప్రతిష్టించారు. దీనికి శ్రీ కొణెదెల రామ్ చరణ్ దేవాలయం అని ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఇక ఈ రస్టిక్ లుక్‌ను అద్భుతంగా తీర్చిదిద్దిన ఈ విగ్రహాన్ని చూసేందుకు జనాలు తరలిరావడంతో పాటు.. క్షీరభిషేకాలు, కర్పూర హారతులు ఇస్తూ తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు.

ON BEHALFOF RRR MEDIA PRIVATE LIMITED. 2-3-603/49A, PATELNAGAR, AMBERPET, HYDERABAD.TELNGANA 500013..
EDITOR:RAMAN RAJU RATHNA.RNI NO:TG/2024/1093, Email:ramannews9@gmail.com Phone:9949152838,7013794396